
# అంతా నా ఇష్టం

## మోత్కూరు ఇన్‌చార్జి కమిషనర్ తీరుపై కౌన్సిలర్ల నారాజ్

- కొత్తగా వచ్చి రెండు నెలలు కావస్తున్నా కౌన్సిల్ మీటింగ్ పెట్టని వైనం
- ప్రజాప్రతినిధులుగా గౌరవం ఇవ్వడం లేదు.. ఏ లెక్కలూ చెప్పడం లేదు
- కౌన్సిల్ మీటింగ్ పెట్టాలని వైస్ చైర్మన్, కౌన్సిలర్ల నోటీస్






ప్రజావారధి/మోత్కూరు

మోత్కూర్ మోత్కూర్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ అంతా తన ఇష్టారాజ్యం అన్నతీరుగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ భర్తతో విభేదాల కారణంగా పంచాది నడుస్తుండగా, కొత్తగా వచ్చిన ఇన్‌చార్జి కమిషనర్ తమను ఏమాత్రం లెక్కకుండా అంతా నా ఇష్టం అన్నట్టుగా వ్యవహరిస్తుండడంతో ఆ పంచాయతీకి మరింత ఆజ్యం పోసినట్టువుతోంది. కొత్త కమిషనర్ తమకు ఏ సమాచారం ఇవ్వడం లేదని, కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదని, ఆయన హైదరాబాద్ నుంచి ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు పోతున్నారో తెలియడం లేదంటున్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలు, ప్రజల పనులపై కమిషనర్‌తో మాట్లాడితే తనకేం పట్టనట్టుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఆయన వచ్చి రెండు నెలలు కావస్తున్నా కౌన్సిల్ మీటింగ్ పెట్టమంటే పెట్టడం లేదని, చైర్మన్ సమయం ఇవ్వడం లేదని చెబుతున్నారని, కమిషనర్‌గా కౌన్సిల్ మీటింగ్ పెట్టాల్సిన బాధ్యత కమిషనర్‌పైనే ఉంటుందని కౌన్సిలర్లు చెబుతున్నారు.

### రూ.కోటి 27 లక్షల లెక్కలేవీ..?

నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టే నాటికి మున్సిపల్ ఖాతాలో రూ.కోటి 27 లక్షల నిధులు ఉన్నట్టు వైస్ చైర్మన్, కౌన్సిలర్లు చెబుతున్నారు. నెలన్నర క్రితం గత కమిషనర్ వెళ్లే నాటికే సుమారు రూ.50 లక్షలు డ్రా చేశారని, ఆ నిధులు దేని కోసం డ్రా చేశారు.. ఎవరికి ఇచ్చారన్నది చెప్పడం లేదంటున్నారు. ప్రస్తుతం మున్సిపల్ అకౌంట్లో ఎన్ని డబ్బులు నిల్వ ఉన్నది కూడా సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచాల్సిన అవసరమేముందని ప్రశ్నిస్తున్నారు. వేసవిలో వార్డుల్లో కౌన్సిలర్లు తాగునీటి అవసరాలు, ఇతర చిన్న చిన్న పనులు చేయగా వాటికి బిల్లులు ఇవ్వడం లేదని చెబుతున్నారు. మున్సిపాలిటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తున్న నిధులు, పన్నుల వసూళ్ల ద్వారా ఎన్ని లక్షలు వస్తున్నాయి, మున్సిపాలిటీకి ఎన్ని బ్యాంక్ ఖాతాలు ఉన్నాయి, ఆస్తులు, ఆదాయ, వ్యయాలు, గత బడ్జెట్‌లో లెక్కలేవీ చెప్పలేదని చెబుతున్నారు. కౌన్సిలర్లకు సమాచారం లేకుండానే కొత్తగా 8 మందికి పైగా సిబ్బందిని ఏ ప్రాతిపదికన నియమించారని ప్రశ్నిస్తున్నారు.

### కోతుల లెక్కేది..?

మున్సిపాలిటీలో కోతుల బెడద నిర్మూలన కోసం కోతులను పట్టించాలని నిర్ణంచారు. కోతులు పట్టే వారికి కోతికి రూ.600 చొప్పున చెల్లించేలా రూ.3 లక్షల నిధులకు ఆమోదం తెలిపారు. ఇటీవల కొన్ని వార్డుల్లో అక్కడక్కడ కొన్ని రోజుల పాటు కోతులు పట్టించారు. ఎన్ని కోతులు పట్టించారన్నది లెక్క చెప్పడం లేదని, మిగతా వార్డుల్లో కూడా కోతులు పట్టించాలని చైర్మన్‌ను అడిగితే పట్టించుకోవడం లేదని కౌన్సిలర్లు చెబుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఒక్కో కోతికి రూ.300 వరకు చెల్లిస్తుండగా ఇక్కడ మాత్రం రెట్టింపు చేసి రూ.600 చొప్పున చెల్లించడం కూడా అనుమానాలకు తావిస్తోంది. సుమారు 1500లకు పైగా కోతులు పట్టినట్టు చెబుతున్నారని, అంత బడ్జెట్ ఎక్కడి నుంచి తెచ్చి ఇస్తారంటున్నారు. కోతులు పట్టేవారికి డబ్బులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం వారు కూడా కోతులు పట్టడం లేదని తెలిసింది.

### పర్మిషన్లు..మున్సిపల్ ఆదాయానికి గండి

మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పలు నిర్మాణాలకు పర్మిషన్లు ఇవ్వడంతో చైర్మన్ భర్త అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. బుజిలాపురంలో సోలార్ పవర్ ప్లాంట్‌కు, వెంచర్ల అనుమతుల విషయంలో మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం లేదని, దీంతో మున్సిపాలిటీకి వచ్చే ఆదాయానికి గండి పడుతుందన్నారు. ఇంటి నంబర్లు, ఇండ్ల నిర్మాణాలకు అనుమతుల కోసం ప్రజలను డబ్బుల కోసం వేధిస్తున్నారన్న ఫిర్యాదులు తమ వద్దకు వస్తున్నాయని చెబుతున్నారు. పెద్ద చెరువు బఫర్ జోన్‌లో కొత్తగా ప్రస్తుతం కొందరు 20, 30 ఫీట్ల మేర ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని తాము రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేయగా వారు చర్యలు తీసుకోకుండా కొందరు అడ్డుకుంటున్నారని, చెరువు స్థలం ఆక్రమించి నిర్మాణం చేస్తుంటే కమిషనర్ ఎలా అనుమతులు ఇస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

### కౌన్సిల్ మీటింగ్ పెట్టాలని వైస్ చైర్మన్, కౌన్సిలర్ల నోటీస్

సుమారు రెండు నెలలవుతున్నా కౌన్సిల్ మీటింగ్ పెట్టకపోవడంతో వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్నతో సహా పలువురు కౌన్సిలర్లు కమిషనర్‌కు నోటీస్ ఇచ్చినట్టు తెలిసింది. కౌన్సిల్ మీటింగ్ పెట్టాలని కమిషనర్‌కు కౌన్సిలర్లు నోటీస్ ఇవ్వడం మున్సిపాలిటీ చరిత్రలో ఇదే మొదటిసారి అంటున్నారు. ఎమ్మెల్యే, చైర్మన్ భర్తకు తోడు కమిషనర్ కూడా తోడవడంతో వారికి, కౌన్సిలర్ల మధ్య నడుస్తున్న పంచాదితో మున్సిపల్ పాలనంతా వివాదాలమయంగా మారిందన్న చర్చ నడుస్తోంది. కమిషనర్‌కు ఇక్కడ పని చేయడం ఇష్టం లేకపోతే ప్రజలను, తమను ఇబ్బంది పెట్టకుండా ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటున్నారు. ఇన్‌చార్జి కమిషనర్ వచ్చి కూడా రెండు నెలలు సమీపిస్తున్నా పట్టణంపై పూర్తి అవగాహన లేకపోవడంతో పాలన కూడా గాడితప్పుతోందంటున్నారు. వైస్ చైర్మన్, కౌన్సిలర్లు ఇచ్చిన నోటీస్‌తో ఎట్టకేలకు ఈనెల 29న కౌన్సిల్ మీటింగ్ నిర్వహించనున్నట్టు తెలిసింది. కౌన్సిల్ మీటింగ్‌కు ఎమ్మెల్యే సామేల్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని సమాచారం. ప్రస్తుతం నెలకొన్న పొలిటికల్ హీట్‌తో ఈ మీటింగ్ ఎలా జరుగుతుందో చూడాలి.